క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోండి



అయిజ: సీఎం సహాయక నిధి నుంచి విడుదల చేసిన ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని అలంపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే విజయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల్లో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం



ధరూరు: మండలంలోని భీంపురం గ్రామం పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం మధ్యాహ్నం పాఠశాలలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో బదిలీపై వెళ్తున్న హెచ్‌ఎం వీరన్న గౌడ్, ఉపాధ్యాయులు సీతం నాయుడులను శాలువా, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. 12 ఏళ్లుగా విద్య బోధన చేసిన ఉపాధ్యాయులను గ్రామస్తులు అభినందించారు.

సహజ వనరులను కాపాడుకుందాం



అయిజ: మొక్కలు విరివిగా నాటి సహజ వనరులను కాపాడుకుందామని ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి అన్నారు. శుక్రవారం మండలంలోని పులికల్ గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయురాలు మాట్లాడారు. మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని, విద్యార్థులందరూ వీలైనన్ని మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుమలత, బషీర్, రామాంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి కాపాడాలి

ఉండవెల్లి: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో వనమహోత్సవంలో భాగంగా మొక్క



లను నాటి వాటిని పరిరక్షించాలని ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఎస్‌ఐ, పోలీస్ సిబ్బంది మొక్కలు నాటారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, అబ్దుల్, నరసింహ, రమేష్, తదితర్లు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

గట్టు: వేధింపులు భరించలేక పురుగులమందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మండలంలోని లింగాపురంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మల్లేష్ కథనం మేరకు.. కర్ణాటకలోని ఇడుపునూరు గ్రామానికి చెందిన మల్లమ్మ(40)ను 20 ఏళ్ల క్రితం లింగాపురం గ్రామానికి చెందిన వీరన్నకు ఇచ్చి వివాహం చేశారు. వారికి ఇద్దరు కుమారులు. 10 ఏళ్ల క్రితం భర్త వీరన్న చనిపోయాడు. అదే గ్రామానికి చెందిన బోయ మల్దకల్ అలియాస్ పూజారి కర్రెన్న 3 నెలలుగా ఆమెను లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడు. దీంతో గురువారం సాయంత్రం పురుగులమందు తాగింది. చుట్టు పక్కల వారు గమనించి చికిత్స నిమిత్తం మల్లమ్మను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందింది. లైంగిక వేధింపుల కారణంగానే ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆమె సోదరుడు కుర్వదొడ్డ నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రిటైర్డు జీహెచ్‌ఎం మృతి

అలంపూర్: రిటైర్డు జీహెచ్‌ఎం మురళీ మోహన్ మృతి చెందినట్లు ఎంఈఓ అశోక్ కుమార్ తెలిపా రు. అలంపూర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పా ఠశాలలో మురళీ మోహన్ జీహెచ్‌ఎంగా విధులు నిర్వహించి పదవీ విరమణ చేసినట్లు తెలిపారు. మండలంలోని లింగవావాయి గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో జీహెచ్‌ఎంగా పదేళ్లపాటు విధులు నిర్వహించారని తెలిపారు. 20న అంత్యక్రియలు కర్నూల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మలుపుల్లో ప్రమాదం



కారుపాకుల స్టేజీ మలుపు దగ్గర రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెట్లు



షేకుపల్లి వాగు దగ్గర రోడ్డుకు ఇరువైపుల ఉన్న ముళ్లపొదలు

- సూచిక బోర్డుల జాడేలేదు
- రోడ్లకు ఇరువైపులా పెరిగిన చెట్లు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

ఎర్రవల్లిచౌరస్తా: ఒకచోట కుడివైపు, మరొకచోట ఎడమవైపు ప్రమాదకరంగా రోడ్లపై ఉన్న మూల మలుపుల వల్ల నిత్యం ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వాహనదారులు ప్రయాణిస్తున్నారు. దీనికి తోడు రోడ్లకు ఇరువైపుల ఏపుగా ముళ్లపొదలు, ఇతర చెట్లు పెరగడంతో మూల మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించలేదు. దీంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మలుపుల దగ్గర అధికారులు ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఎర్రవల్లి చౌరస్తాకు, ఆయా గ్రామాల నుంచి మండల కేంద్రానికి వెళ్లే దారుల్లో మూల మలుపులు అధికంగా ఉన్నాయి. ఏ దిక్కు నుంచి ఏ ప్రమాదం సంభవిస్తుందోనని నిత్యం భయంతో వాహనదారులు ప్రయాణిస్తున్నారు.

నిర్లక్ష్యం వల్ల పెరుగుతున్న ప్రమాదాలు..

అధికారుల నిర్లక్ష్యం కారణంగా రోజురోజుకు ప్రమాదాలు పెరుగుతున్నాయి. ప్రమాదం పొంచి ఉన్నచోట్ల, రోడ్లకు ఇరువైపుల ఉన్న ముళ్లపొదలను తొలగించకపోవడం దీనికి ముఖ్య కారణం. మలుపుల దగ్గర ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం మలుపుల దగ్గర ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించక ప్రమాదాలు జరుగున్నాయి. మూల మలుపుల దగ్గర ఎటు చూసినా కంపచెట్లే దర్శనమివ్వడంతో రాత్రి వేళల్లో అధికసంఖ్యలో వాహనదారులు ప్రమాదాలకు గురై ప్రాణాలను కోల్పోయిన సంఘటనలు చాలానే ఉన్నాయి. రోడ్లకు ఇరువైపులా ప్రమాదకరంగా గుంతలు, బావులు ఉన్నాయి.

ప్రమాదాల మలుపులు..

ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని కారుపాకుల స్టేజీ, వీరాపురం స్టేజీ, దువాసిపల్లి స్టేజీ సమీపంలో, సాసనూలు కాల్వ, ఎర్రవల్లి రైస్ మిల్లు దగ్గర, జింకలపల్లి దగ్గర, మునగాల కాల్వ, శివనంపల్లి స్టేజీ, రైల్వే స్టేషన్ దగ్గర, మలుపులు అధికంగా ఉన్నాయి. గతంలో ఈ మలుపుల దగ్గర ఎన్నో ప్రమాదాలు జరిగి ప్రయాణికులు ప్రాణాలను కోల్పోయారు. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు వాటిపై దృష్టిపెట్టడం లేదు. రోడ్ల పైనున్న సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే వారు కరువయ్యారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే రోడ్లపై జరుగుతున్న ప్రమాదాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



అధిక ప్రమాదాలు జరిగే దువాసిపల్లి స్టేజీ సమీపంలోని మలుపు

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి..



మా గ్రామం నుంచి ఎర్రవల్లి చౌరస్తాకు వెళ్లి రావాలంటే అధిక మలుపుల కారణంగా వాహణదారులు నిత్యం జంకుతున్నారు. ప్రమాదకరంగా మలుపులు ఉండటంతో రాత్రివేళల్లో రోడ్డు సక్రమంగా కన్పించకపోవడంతో నిత్యం ఇబ్బందులకు గురవుతున్నాం. పాలకులు, అధికారులు తక్షణమే స్పందించి మలుపుల దగ్గర ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి.

– వీరన్న, వాహనదారుడు, ఆర్.గార్లపాడు

చెట్ల పొదలను తొలగించండి



మూల మలుపుల దగ్గర రోడ్లకు ఇరువైపులా చెట్ల పొదలు ఏపుగా పెరిగాయి. దీనివల్ల ఎదురుగా వస్తున్న వాహనాల రాకపోకలు కన్పించకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్ల పొదలను తొలగించాలి.

– రాజు, వాహనదారుడు, సాసనూలు

సమస్యను పరిష్కరిస్తాం

రోడ్లకు ఇరువైపుల ఉన్న ముళ్లపొదలను తొలగించేందుకు, ప్రమాదకరంగా ఉన్న మూలమలుపుల దగ్గర సూచిక బోర్డులను ఏర్పాటు చేయడం కోసం టెండర్లను ఆహ్వానిస్తున్నాం. టెండర్లు పూర్తయిన వెంటనే ముళ్లపొదలను తొలగించి, ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేసి ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తాం.

– మహేష్‌కుమార్, ఆర్‌అండ్‌బీ ఏఈఈ, ఇటిక్యాల

ఉపాధ్యాయుల సేవలే గుర్తుండిపోతాయి



పరమేశ్వర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

గద్వాల న్యూటౌన్: ఉపాధ్యాయులు తాము అందించిన విద్యాబోధన సేవల ద్వారా గుర్తుండిపోతారని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. శుక్రవారం స్థానిక బృందావన్ గార్డెన్‌లో గద్వాల మండలం పూడూరు జెడ్పీహెచ్‌ఎస్ జీహెచ్‌ఎం, పీఆర్‌టీయూ నాయకులు పరమేశ్వర్‌రెడ్డి పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ డీకే అరుణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పరమేశ్వర్‌రెడ్డి ఉపాధ్యాయుడిగా చిత్తశుద్ధితో విధులు నిర్వహించారని కొనియాడారు. ఆయన శేష జీవితం సుఖ సంతోషాలతో ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ఉపాధ్యాయుల ప్రధాన సమస్య అయిన ఇన్‌కంటాక్స్ తగ్గింపును కేంద్ర పెద్దల దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పరమేశ్వర్‌రెడ్డి దంపతులను శాలువా, బొకె, మెమెంటోతో ఎంపీ ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్‌లతో పాటు పలువురు ఉపాధ్యాయులు, పీఆర్‌టీయూ నాయకులు పరమేశ్వర్‌రెడ్డి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రధాన రోడ్డుపై పొంచిఉన్న ముప్పు



బ్రిడ్జిపై పడిన రంధ్రంను పరిశీలిస్తున్న ఎస్‌ఐ విజయ భాస్కర్

అయిజ: పట్టణ సమీపంలోని పెద్ద వాగుపై కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించిన బ్రిడ్జి శిథిలమైంది. శుక్రవారం బ్రిడ్జి మధ్యలో పెద్ద రంధ్రం ఏర్పడింది. అయిజ నుంచి కర్నూల్‌కు ఏర్పాటు చేసిన రోడ్డుపై నిత్యం వేల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. రంధ్రం ఏర్పడిన వెంటనే కొంతమంది యువకులు రంధ్రం చుట్టూ రాళ్లు పెట్టి, ప్రమాద సూచికగా ఎర్ర వస్త్రాన్ని జెండాగా కట్టారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్‌ఐ విజయ భాస్కర్ రాత్రి సంఘటనా స్థలం చేరుకొని బారికేడ్‌లను పెట్టించారు. సంబంధిత అధికారులకు సమాచారం చేరవేశారు. రంధ్రం వద్ద కానిస్టేబుల్‌ను కాపలా పెట్టారు.

ఆలయాల్లో కుంకుమార్చన

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో శుక్రవారం అర్చకులు అభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు భక్తిశ్రద్ధలతో సరస్వతీ దేవిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఎర్రవల్లి చౌరస్తాలోని శివాంజనేయస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు నర్సింహస్వామి ఆధ్వర్యంలో కుంకుమార్చన పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు.



ఎర్రవల్లిలో కుంకుమార్చన చేస్తున్న భక్తులు

అమ్మవారికి కుంకుమార్చన

గట్టు: మండల కేంద్రంలోని భవానీ మాత ఆలయంలో ఆషాఢమాసం సందర్భంగా మహిళలు అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మహిళలతో పాటుగా ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



గట్టులో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

రైతులతో నిండిన బ్యాంకులు



అయిజలో ఎస్‌బీఐలో రుణ మాఫీ వివరాలను తెలుసుకుంటున్న రైతులు

ఉండవెల్లి: మండలంలోని రైతులు రూ.1లక్ష లోపు రుణమాఫీ సందర్భంగా సంబరాలు అంబరాన్నంటాయి. రెండు సార్లు మాఫీ కావడంతో కొందరు ఆనందంతో ఉన్నారు. కొందరికి ఇంకా లిస్ట్‌లో పేర్లు రాకపోవడంతో బ్యాంకు మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్‌ల చుట్టూ చేరుతున్నారు. ఎస్బీఐ బ్యాంకులో రైతుల పేర్లను గోడకు అంటించడంతో చూసుకుంటున్నారు. కొందరు డబ్బులు అకౌంట్లో పడిన వారు డ్రా చేసుకుని వెళ్లిపోయారు. మండలంలోని ఎస్బీఐ బ్యాంకులో 800 మంది రైతులకు రుణాలు మాఫీ అయినట్లు మేనేజర్ ధనుంజయ్ తెలిపారు.

అయిజ: మండలంలోని వివిధ గ్రామాల రైతులు ఆయా బ్యాంకులకు వెళ్లి రుణమాఫీపై తెలుసుకునేందుకు క్యూలో నిలబడ్డారు. నిబంధనల ప్రకారం తమకు రుణమాఫీ అవుతుందో లేదో అనే ఆందోళనలో రైతులు ఉన్నారు. కొందరికి రుణమాఫీ కాకపోవడంతో రైతులు అధికారులను నిలదీస్తున్నారు. ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని, బ్యాంక్ అధికారులు రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నారు. మండల కేంద్రంలోని ఎస్‌బీఐలో లక్ష లోపు రుణం తీసుకున్న రైతుల ఖాతాలు 2578 ఉన్నాయి. వారికి రూ.16.35 కోట్లు రుణం ఇచ్చారు. ఇప్పటి వరకు 1378 ఖాతాల నుంచి రూ.8.31 కోట్లు మాత్రమే రుణమాఫీఅయ్యింది. సగం మందికి మాత్రమే రుణాలు మాఫీ కావడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఎక్కువ శాతం రైతు లకు రూ.లక్ష వరకు రుణాలు ఉన్నాయని, వాటికి వడ్డీ జతచేయడంతో రుణం రూ.లక్షకు పైగా అ య్యిందని, రెండో విడతలో ఎక్కువ మందికి రుణమాఫీ అయ్యే అవకాశం ఉందని బ్యాంక్ అధికారులు పేర్కొంటున్నారు.



ఉండవెల్లిలో రుణమాఫీ లిస్టును చూస్తున్న రైతులు

రుణమాఫీపై అధికారులను సంప్రదించండి

మానవపాడు: మండలంలోని 17 గ్రామాల్లో రుణమాఫీ అయిన రైతులకు సందేహాలు ఉంటే ఆయా గ్రామాల వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రుణమాఫీ వివరాలకోసం ఆధార్‌కార్డు తీసుకొని రైతులు మండల కార్యాలయంలో గాని, వ్యవసాయ విస్తరణ అధికారులను గాని సంప్రదించాలని తెలిపారు.

సరైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



రైతులకు అవగాహన కల్పిస్తున్న చెరుకు శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్



యంత్రాల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న కంపెనీ అధికారులు

- శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్

ఎర్రవల్లిచౌరస్తా: చెరుకు రైతులు పంటల సస్యరక్షణలో సరైన యాజమాన్య పద్ధతులను పాటించి అధిక దిగుబడి సాధించవచ్చని చెరుకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్ సూచించారు. శుక్రవారం ఎర్రవల్లి మండల కేంద్రంలోని ఎస్‌ఎస్ ఆడిటోరియంలో ఎస్ఎస్ఎల్ కృష్ణవేణి షుగర్స్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో చెరుకు రైతులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై చెరుకు సాగులో తీసుకోవాల్సిన మెలకువలపై రైతులకు అవగాహన కల్పించారు. అధిక మొత్తంలో చెరుకు పంటను సాగు చేసే రైతులు కూలీలతో ఇబ్బందులు లేకుండా తక్కువ ఖర్చుతో యంత్రాలను ఉపయోగించి సాగు చేయవచ్చని తెలిపారు. ముఖ్యంగా 93వి297, సి086032 రకం చెరుకును సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుందన్నారు. రైతులు నవంబర్ నుంచి మార్చి వరకు తమ పొలంలో పంటను విత్తుకోవచ్చన్నారు. పంటకోత నవంబర్ నుంచి మార్చి వరకు ఉంటుందన్నారు. ఎకరాకు 40నుంచి 50 టన్నుల వరకు దిగుబడి వస్తుందన్నారు. ఎకరాకు కేవలం రూ. 20 వేల నుంచి రూ. 25వేల వరకు ఖర్చు అవుతుందన్నారు. ఎకరాకు రూ.60వేల నుంచి రూ.80వేల వరకు ఆదాయం పొందవచ్చన్నారు. చెరుకు పంటలో ఉపయోగించే వివిధ యంత్రాల వినియోగంపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కంపెనీ వైస్ ప్రెసిడెంట్ రూపేస్‌కుమార్, అధికారులు రాంమోహన్ ప్రసాద్, మురలి, చిన్నబ్బాయి, ప్రవీణ్, సిబ్బంది, రైతులు ఉన్నారు.

కురుస్తున్న వర్షంతో రైతుల హర్షం

రాజోళి: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ వానాకాలం సీజన్‌లో రైతులు పలు రకాల పంటలు సాగు చేసేందుకు విత్తనాలు వేసినప్పటికీ సరైన వర్షాలు లేకపోవడంతో రైతులు తీవ్ర నిరాశకు గురయ్యారు. అడపాదడపా వర్షాలు కురిసినా, పూర్తిగా, రైతులు ఆశించిన స్థాయిలో వర్షం లేకపోవడంతో పంటలకు ఇబ్బందులు తలెత్తుతాయని ఆవేదన చెందారు. తాజాగా రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. పత్తి, కంది పంటలతో పాటు పలు గ్రామాల్లో వరినారు పోసుకున్న రైతులు తమకు సరైన సమయంలో వర్షం కురిసిందని సంతోషపడుతున్నారు.

మోస్తరు వర్షం



ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో మోస్తరు వర్షం కురుస్తోంది. వర్షం పడడంతో రోడ్లు జలమయమయ్యాయి. విద్యార్థులు వర్షంలోనే తడుస్తూ పాఠశాలలకు వెళ్తున్నారు. రైతులు పంట పొలాలో నారుమడులు సిద్ధం చేస్తున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండండి

శాంతినగర్: ముసురు వర్షాలు కురుస్తుండడంతో మట్టి మిద్దెలు కూలిపోయే ప్రమాదం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల తహసీల్దార్ జ్యోషి శ్రీనివాసశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. వడ్డేపల్లి పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో పురాతన ఇళ్లలో నివసించే వారు ఇళ్లు ఖాళీ చేసి ప్రభుత్వ భవనాల్లో ఉండాలని సూచించారు. ముందస్తుగా ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని కోరారు.


క్రమశిక్షణతో చదివి మంచి స్థాయికి చేరాలి



చింతలకుంట పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీ టీం సభ్యులు

కేటీదొడ్డి: విద్యార్థులు క్రమశిక్షణలో చదివి మంచి స్థాయికి చేరాలని పోలీస్ షీ టీం సభ్యులు సూచించారు. శుక్రవారం మండలంలోని చింతలకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు షీ టీమ్ సభ్యులు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ చక్కగా చదువుకుని భవిష్యత్ లక్ష్యాలకు చేరుకోవాలని, ప్రతి విద్యార్థి షీ టీం సేవలు తెలుసుకోవాలన్నారు. షీ టీమ్ అందిస్తున్న సేవలను తెలియజేస్తూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థినులకు ఎలాంటి సమస్య ఎదురైనా డయల్ 100, షీ టీమ్ నెంబర్ 8712670312 ఫోన్ చేసి సమాచారం అందిస్తే, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో షీ టీమ్ దివ్య, లోకేశ్వరి, సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు రవి, క్రిష్ణ, రత్నాకర్, శంకర్‌నాయక్, సుధ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో గెలుపు కోసం కృషి చేయాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

గద్వాల రూరల్: రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ గెలుపొందేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని బీజేపీ ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గద్వాల పట్టణంలోని ఎస్వీ ఈవెంట్ హాల్లో ఏర్పాటు చేసిన బీజేపీ జిల్లా కార్యవర్గ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసారి స్థానిక సంస్థలకు త్వరలో జరిగే ఎన్నికల్లో బీజేపీ విజయఢంకా మోగేలా ఇప్పటి నుంచే అందరు సంసిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, రాష్ట్ర మైనార్టీ అధ్యక్షుడు అఫ్సర్‌పాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులు, శివారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజగోపాల్, బండల వెంకట్రాములు, బండల పద్మావతి, అక్కల రమాదేవి, దేవదాసు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా పాఠశాల



పాఠశాల ఆవరణలో తాగి పడేసిన గ్లాసులు

కేటీదొడ్డి: మండలంలోని గువ్వలదిన్నె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మద్యం బాబులకు అడ్డాగా మారింది. చీకటి పడితే చాలు మందుబాబులు పాఠశాల గదుల్లో, కాంపౌండ్‌లో కూర్చుని మద్యం తాగుతున్నారు. తాగిన తరువాత ఖాళీ సీసాలను అక్కడే వదిలేసి వెళ్తున్నారు. పాఠశాల ప్రాంగణం ఖాళీ సీసాల పెంకులతో నిండిపోతున్నది. విద్యార్థులు, ఉపాధ్యాయులు వచ్చేసరికి కాంపౌండ్‌లో తాగి పడేసిన మద్యం సీసాలు కనిపిస్తున్నాయి. వారే సీసపెంకులను శుభ్రం చేసుకోని తరగతులు నిర్వహిస్తున్నారు. అధికారులు, పోలీసులు ముందుబాబుల ఆగడాలకు కళ్లెం వేయాలని కోరుతున్నారు.

రైతువేదిక గోడలకు పగుళ్లు



మానవపాడులో పగుళ్లు విచ్చిన అరుగు బండలు



పగుళ్లు వచ్చిన గోడ



రైతువేదిక లోపల కుంగిన ఫ్లోర్

మానవపాడు: రైతులకోసం సభలు, సమావేశాలు, అవగాహన సదస్సుల కోసం నిర్మించిన రైతువేదికలు నేడు క్రాక్‌లు, పగుళ్లు వచ్చాయి. బండలు లేక రైతులు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంలోని రైతువేదిక చుట్టూ అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నా, పట్టించుకునే నాథుడు కరువయ్యారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

